# హింసధ్వని

శివయ్య మాస్టారు నిలువెల్లా వణుకుతున్నారు.

వణుకుతూనే, ఆయన రోడ్డు మీద వడివడిగా అడుగులు వేస్తున్నారు.

మాస్టారి గుండె దడదడా కొట్టుకుంటోంది. చెవుల్లో సముద్రపు హోరు... మనసు ఎప్పుడో మొద్దుబారిపోయింది. అరవై ఏళ్ల వయోభారంతో శరీరం తూలిపడుతోంది. మాస్టారు ఎలా నడుస్తున్నారో... ఎదరుగా వస్తోన్న వాహనాల్ని ఎలా తప్పించుకుంటున్నారో స్పృహ లేదు... పరుగులాంటి నడక... ఉరుకులాంటి నడక...

మాస్టారు నడుస్తూనే రెండు రోడ్లు దాటారు. అలవాటయిన దారిలో ముందుకు సాగి తమ వీధిలోకి మలుపు తిరిగారు. వీధిలో మరింత వేగంగా, అడుగులు వేసి ఒక్క ఉదుటున తమ ఇంటి అరుగు మెట్లెక్కారు. తలుపుమీద 'దబ్, దబ్' మంటూ కొట్టారు. భార్య వర్ధనమ్మ తలుపు తీయగానే, ముందుకు వాలిపోతున్నట్లుగా లోపలికి నడిచి వాలు కుర్చీలో కూలబడినట్లుగా కూర్చుండిపోయారు.

"అదేవిటండీ? అలా ఉన్నారు? ఏమయ్యింది?' బజారుకు వెళ్లి ఖాళీ సంచీతో వచ్చారేమిటి? అయ్యో! అలా ఆయాసపడి పోతున్నారేమిటి?" వర్ధనమ్మ కంగారుపడుతూ లోపలికి వెళ్లి గ్లాసుతో మంచినీళ్లు తెచ్చి చేతికిచ్చింది. మాస్టారు గటగటా నీళ్లు తాగి గ్లాసు నేలమీద పెట్టారు. మనిషి వణుకుతూనే, వెనక్కి వాలి కళ్లు మూసుకున్నారు.

"ఏంవయ్యిందండీ...?" వర్ధనమ్మ ఆందోళనగా మళ్లీ అడిగింది.

మాస్టారు జవాబు చెప్పలేదు. కొన్ని నిమిషాలు కళ్లు మూసుకుని అలాగే ఉండిపోయారు. వర్ధనమ్మ భర్త ఒంటిమీద చేయి వేసింది. భార్య చేయి వంటిమీద పడగానే - మాస్టారి శరీరంలో వణుకు కొంచెం తగ్గింది. గుండె దడ నెమ్మదించినట్లయింది... మాస్టారు కళ్లు తెరిచి భార్య ముఖంలోకి భయవిహ్వలంగా చూశారు.

"బజారులో ఈ పూట చాలా దారుణం జరిగిపోయింది వర్ధనం! నా కళ్లముందే..." మాస్టారు ఆయాసపడుతూ అన్నారు.

"అయ్యో! ఆయాసపడకండి! తర్వాత చెబుదురుగాని... ముందు కాస్సేపలా కళ్లు మూసుకుని - పడుకోండి" వర్ధనమ్మ ఆదుర్దాగా భర్త గుండెలమీద రాయసాగింది.

మాస్టారు కళ్లు మూసుకోలేదు...

"మన ఊరి ఎమ్మెల్యే వీరాస్వామి లేడూ... అతగాడ్ని నడిరోడ్డు మీద, పట్టపగలు... పదిమంది మనుషులు ముసుగు లేసుకుని వచ్చి గొడ్డళ్లతో తెగనరికి... జీపులో పారిపోయారు."

"అయ్యో! ఎంత ఘోరం జరిగిందండీ... కలికాలం! రోజులు మండిపోతున్నాయి

దేవుడా!''

"నా కళ్లముందే దారుణం జరిగిందేమో... నాకు భూమి గిర్రున తిరిగినట్లయింది. రోడ్డంతా రక్తం... శరీరంలో ఏ భాగానికా భాగం తెగిపోయి, గిలగిలా కొట్టుకొంటోన్న వీరాస్వామి మొండెం... జనం అరుపులు, కేకలు... ఎక్కడ వాళ్లక్కడ నుంచి పిట్టల్లా ఎగిరిపోయారు... దుకాణాలు మూసివేశారు. ఎలా వచ్చానో ఇంటికి...'' మాస్టారు ఆ దృశ్యాన్ని నెమరువేసుకుంటూ కళ్లు మూసుకున్నారు.

"ఏమిటోనండీ! ఏ రోజు ఏం జరుగుతుందో... ఎందుకు జరుగుతుందో అంతు పట్టడం లేదు. ఉండండి! వేడిగా, కాస్త కాఫీ పెట్టుకువస్తాను'' వర్ధనమ్మ హడావుడిగా వంటగదిలోకి వెళ్లింది.

మాస్టారు కళ్లు మూసుకునే ఉన్నారు. ఆయన మనో యవనిక మీద ఎన్నో దారుణ దృశ్యాలు కదిలిపోతున్నాయి. ఏ దృశ్యం చూసినా రక్తసిక్తమే... మనిషి పాలిట, మనీషే మృత్యువు... విలయతాండవం... వికటాట్టహాసం... అంతటా శవాలు... హాహాకారాలు... ఆర్తనాదాలు... కత్తులు... కటార్లు... గొడ్డళ్లు, గునపాలు... మరతుపాకులు... బాంబులు... మందుపాతర్లు... మనిషి ఏమయిపోతున్నాడు...? ఎక్కడికి పోతున్నాడు? ఇది ఏ నాగరికతకు... ఫలశ్రుతి? కొండల్లో, గుహల్లో దిగంబరంగా బతికి, హింసతో, దౌర్జన్యంతో ఆకలి తీర్చుకున్న ఆదిమ మానవుడికి వారసుడవుతున్నాడా నేటి ఆధునికుడు...?

ఉదయం లేస్తే... వార్తాపత్రిక రక్తం కక్కుకుంటూ ఉంటుంది. అంతటా రక్తపాతమే. దారుణ హత్యలు, మారణ హోమాలు... మానభంగాలు, వధూ మరణాలు, దొమ్మీలు, దోపిడీలు, ప్రమాదాలు, కాల్పులు, కల్లోలాలు... ఎక్కడ చూసినా హింస... హింసతో ప్రపంచం విలవిలలాడిపోతూంది. మరో మహాత్ముడు, మరో ప్రవక్త, మరో జీసస్, మరో బుద్ధుడు, మళ్లీ జన్మించి, తమ అమృత ప్రేమతత్వంతో... ఈ నేలను పునీతం చేయాలా?

"ఏమండీ! కాఫీ తీసుకోండి!''

శివయ్య మాస్టారు చటుక్కున కళ్లు తెరిచారు. భార్య చేతిలోంచి కాఫీ అందుకున్నారు. రెండు గుక్కలు తాగారో లేదో... అదిరిపడుతూ కుర్చీలోంచి లేచారు. ఆయనకంటే ముందు, వర్ధనమ్మ గబగబా వీధి గుమ్మంవైపు వెళ్లింది. వీధిలో జనం గోలగా పరుగులు పెడుతున్నారు. పోలీసు జీపులు రెండు రయ్‌మని దూసుకుపోయాయి. ఫైరింజను కూడా ఒకటి గంట మోగించుకుంటూ వెళ్లింది. వర్ధనమ్మ కంగారుగా తలుపులు మూసి గడియవేసింది.

మాస్టారు చైతన్యరహితంగా కుర్చీలో కూర్చుండిపోయారు.

ఆయన కళ్లల్లో ఎమ్మెల్యే వీరాస్వామి రూపమే కదులుతోంది... బజారులో బ్రాందీషాపు ప్రారంభోత్సవానికి పాదచారియై వెళ్తోంటే... ఈ దారుణహత్య జరిగింది... ఆయన చావుకు మృత్యు రూపం రాజకీయమే! వ్యవస్థలో రాజకీయం, మరీ భ్రష్టుపట్టి పోయింది. అలజడి,

అరాచకత్వం దాని ఊపిరయింది. గూండాయిజం దాని గుండె స్పందనగా మారింది... ప్రజల శాంతిభద్రతలతో దానికి పని లేదు. రాజకీయమా వర్ధిల్లు...!

వీధిలో కలకలం, గోల ఎక్కువయింది... ఎవరో పెద్దగా ఏడుస్తూ పరుగెడుతున్నారు... మాస్టారు, అశాంతిగా కణతలు నొక్కుకుంటూ వీధి అరుగుమీదకు వచ్చారు...

"ఏం జరిగింది బాబూ!" పరుగెడుతున్న ఓ యువకుడ్ని ఆత్రంగా అడిగారు.

"ఎమ్మెల్యేగారి హత్యకు నిరసనగా ఇళ్లు, దుకాణాలు తగలబెట్టేస్తున్నారు."

ఆ యువకుడు రొప్పుతూ ముందుకుపోయాడు.

"ఏవండీ! మీరు త్వరగా లోపలికి వచ్చేయండి. పెద్ద బజారులో డాక్టరు అవతారంగారి హాస్పిటల్ని ధ్వంసం చేసేశార్ట... ఆయన ఇల్లు, కారు కూడా..." వర్ధనమ్మ పెరట్లోంచి వచ్చి, విసురుగా మాస్టారు చేయి పట్టుకుని లోపలికి లాక్కొని పోయింది. మధ్య గదిలో కూర్చోబెట్టి అన్నిగదులు, తలుపులు, కిటికీలు, దడదడమంటూ మూసివేసింది.

డాక్టరు అవతారంగారి హాస్పిటలు పాడుచేయడం ఏమిటి? ఆయన ఇల్లూ వాకిలీ తగలబెట్టడం ఏమిటి? డాక్టరు అవతారం, మంచి హస్తవాసి ఉన్నవాడు. పేదవాళ్లకు ఉచితంగా వైద్యం చేస్తాడన్న ప్రతీతి కూడా ఉంది... ఆయన చేసిన నేరం ఏమిటి? పాపం ఏమిటి...?

మాస్టారి ఆలోచనలు తెగలేదు. తలుపుల్ని ఎవరో దబదబా బాదుతున్న శబ్దం వినిపించింది. వర్ధనమ్మ వజవజా వణికింది. మాస్టారు గడ్డగట్టుకు పోయినట్టుగా ముడుచుకుని ఉండిపోయారు. ఎవరూ అడుగు ముందుకు వేయలేదు.

ఏమయిందో తలుపుమీద చప్పుడు ఆగిపోయింది. వెనువెంటనే ఎవరిదో స్త్రీ గొంతు ఏడుస్తూ వినబడింది. క్రమంగా ఆ ఏడుపు రోదనగా మారిపోయింది.

మాస్టారు ఊపిరి ఉగ్గబెట్టుకుంటూ బయటికి అడుగులు వేశారు.

"ఏవండీ! మీరు బయటకు వెళ్లొద్దు... ఎవరో ఏవిటో! మనకెందుకు చెప్పండి" వర్ధనమ్మ భర్తని వారించింది.

"ఎవరో ఆడ కూతురు... పైగా ఏడుస్తోంది, ఎవరో ఏవిటో చూడనీ!"

మాస్టారు వీధి గుమ్మం తలుపులు తీశారు. ఎదురుగా నిలబడ్డ స్త్రీమూర్తిని చూడగానే ఆయనకు నోట మాట రాలేదు.

"బాబాయిగారూ! ఊళ్లో మా కులం వాళ్లందరి ఇళ్ల మీద, గూండాలు, రౌడీలు దాడి చేస్తున్నారట... మనుషుల్ని వెదికి, కొట్టి చంపుతున్నారట... మా కులం నాయకులు ఎవరో, ఎమ్మెల్యే గారిని చంపించారట... సమయానికి ఆయన ఇంట్లో లేరు. నిన్ననగా డ్యూటీకి వెళ్లి ఇంకా ఇంటికి రాలేదు. నాకేం దిక్కు తోచడం లేదు. మీరే నన్ను నా పిల్లల్ని

కాపాడాలి...''

ఆమె భయంతో, దిగులుతో ఏడుస్తూ వెక్కి వెక్కి పడుతోంది. పిల్లలు ఇద్దరూ తల్లిని బల్లుల్లా అంటిపెట్టుకుని పోయారు. ఆవిడ పేరు జానకి. మాస్టారింటికి ఎదురిల్లే వాళ్లది. భర్త చిన్నారావుకు ఏదో కంపెనీలో వాచ్‌మెన్ ఉద్యోగం. పేరుకు చిన్నారావు. మనిషి మాత్రం మొరటుగా, దృఢంగా కండలు దేరి ఉంటాడు. రాత్రుళ్లు తాగి వస్తాడు. భార్య జానకిని కొడుతూ, నానా బూతులు తిడుతూ పెద్ద గొంతుతో వీధంతా అరుస్తాడు. భర్త ఎంత కొట్టినా జానకి నోరు విప్పదు. సహనం ఆమెకు పెట్టని భూషణం... చిన్నారావు గోల, కేకలు, అరుపులు, తిట్లు - వీధిలో వాళ్లంతా కాలక్షేపంగా చూసి తలుపులు మూసుకోవటం, రోజూ కనిపించే దృశ్యం... పువ్వులాంటి ఈ పిల్ల, చిన్నారావులాంటి మొరటువాడికి భార్య ఎలా అయిందో, అనుకుంటూ మాస్టారు మధనపడని రోజంటూ ఉండదు.

"రామ్మా! లోపలికి రా! నీకేం భయం లేదు" మాస్టారు, జానకి వైపు ఆలోచనగా చూస్తూ లోపలికి రమ్మని దారి ఇచ్చారు. జానకి తన పిల్లలతో, లోపలికి వచ్చి ఒక మూల దాక్కుంది. భయంతో కంపిస్తూ పిల్లల్ని తనలో పొదువుకుంది.

"బాబాయిగారూ! ఆయనెక్కడున్నారో, ఏమయ్యారో... నాకు చాలా భయంగా ఉందండీ" భర్త గురించి బెంగగా ఏడవసాగింది.

"మీ ఆయన గురించి ఏమీ బెంగ పడొద్దమ్మా! అతను పనిచేసే కంపెనీవాళ్లు ఆ మాత్రం భద్రత కల్పించకపోరు... ఆ కంపెనీ యజమాని పెద్ద పలుకుబడి ఉన్నవాడు. నువ్వు నిశ్చింతగా ఉండు" మాస్టారు లోపలికి నడిచారు.

వర్ధనమ్మకు భర్త చేసిన పని నచ్చలేదు... జానకిని ఆమె పిల్లల్ని లోపలికి రానివ్వడం ఏదో ఆపదను ఆహ్వానించినట్టే అనిపించింది.

"వర్ధనం! ఎందుకయినా మంచిది... అమ్మాయిని పిల్లల్ని పెరటివైపు పాత సామాన్ల గదిలో, అటక మీద దాచెయ్యి... పిల్లలకి కొంచెం మంచినీళ్లు పట్టించు... వెళ్లు"

మాస్టారు హడావుడి పడుతూ భార్యను ఆజ్ఞాపించారు. వర్ధనమ్మ అయిష్టంగానే జానకిని, పిల్లల్ని పెరటివైపు తీసుకుపోయింది. చుట్టుపక్కల ఇళ్లలోంచి ఎక్కడా సడీ చప్పుడూ లేదు. దూరంగా వీధిలోంచి ఏవో శబ్దాలు వినబడుతున్నాయి. ఆకాశం నిండా నల్లటి పొగ వలయాలుగా క్రమ్ముకుంటోంది. ఎక్కడో ఇళ్లు తగలబడుతున్న చిటపట ధ్వనులు లీలగా వినబడుతున్నాయి.

మాస్టారు పూజగదిలోకి నడవబోయారు. అడుగు ముందుకు పడలేదు. వీధిలో నినాదాలు... అరుపులు, కేకలు. మాస్టారువీధి గుమ్మం తలుపు సందులోంచి బయటకి చూశారు. ఆయన గుండె బేజారెత్తిపోయింది.

ఎవరెవరో వాళ్లు... ఇరవైమందికి పైగా ఉంటారు. కొందరు ముసుగులు వేసుకున్నారు.

అందరి చేతుల్లోనూ ఏవో ఆయుధాలున్నాయి. వాళ్లంతా ఎదురుగా వాచ్‌మెన్ చిన్నారావు ఇంటి తలుపుల్ని గునపాలతో బ్రద్దలు కొడుతున్నారు.

"ధన్... ధన్... ఫట్... ఫట్..." ధ్వనులు... మాస్టారి తల పగిలిపోతున్నట్టుగా అనిపించింది. ఆయన గిరుక్కున వెనక్కి తిరిగారు.

"ఏవండీ! జానకిని, పిల్లల్ని అటకమీద కెక్కించేశాను. నాకు కాళ్లూ చేతులూ ఆడటం లేదు. మనం కూడా ఎక్కడయినా దాక్కుంటే మంచిదేమో" వర్ధనమ్మ బితుకు బితుకుమంటూ వచ్చింది.

"మనం దాక్కోవాల్సిన అవసరం ఏమిటి? వయోవృద్ధులం... మనల్ని ఎవరేం చేస్తారు?"

మాస్టారి మాటలు పూర్తికాలేదు. ఆ ఇంటి తలుపులు, పెద్ద శబ్దంతో విరుచుకుపడ్డాయి. రౌడీ మూకలు పెద్దపెట్టున గోలపెడుతూ మాస్టారింట్లోకి చొరబడ్డారు...

"ఏయ్! ముసలోడా! ఆ ఎదురింట్లో వాచ్‌మెన్, ఆడి పెళ్లాం బిడ్డలు ఏడకుబోయినారో చెప్పు... చెప్పరా!" ఎనుబోతులాంటి మనిషి మాస్టారి చేయి వెనక్కి విరిచి పట్టుకున్నాడు. మాస్టారి చేయి ఫటక్‌మని విరిగినట్టే అనిపించింది.

"నాకు తెలియదు బాబు... నన్నొదిలిపెట్టండి" మాస్టారు బాధతో విలవిలలాడిపోయారు. ఎనుబోతు వదల్లేదు. మరోచెయ్యి కూడా వెనక్కి విరిచాడు. ఒకడు మాస్టారి నెత్తిమీద దుడ్డు కర్రతో, దబ్బుమని కొట్టాడు... మరొకడు ఆయన వీపుమీద మోకాలితో తన్నాడు. వేరొకడు పిడికిలి బిగించి కడుపులో గుద్దాడు.

"చెప్పరా ముసిల్నాకొడకా! ఆల్లేడకు పోయినారో చెప్పు..." దెబ్బమీద దెబ్బ... గుద్దుమీద గుద్దు... శివయ్య మాస్టారు బోర్లాపడి నేలను కరుచుకుపోయారు. ఆయన నుదురు చిట్లింది. పెదిమ చితికింది... నడుం విరిగింది... నోట్లో ఉన్న నాలుగు పళ్లు ఊడి కిందపడ్డాయి. మాస్టారు ఖద్దరు చొక్కా రక్తంతో తడిసి ముద్దయింది. ఆయనకు స్పృహ తప్పిపోయింది. వర్ధనమ్మ ఈ హింసకాండను చూసి ఎప్పుడో కళ్లు తిరిగి పడిపోయింది. వాళ్లు పెనుకేకలు పెడుతూ ఇల్లంతా వెదికారు. కనిపించిన వస్తువునల్లా గుండా పిండి చేశారు.

"వాళ్లెక్కడికి పోతార్రా! పదండి... మరో ఇల్లు ఎదుకుదాం!" నినాదాలు చేసుకుంటూ, నిప్పు తొక్కిన కోతుల్లా, వచ్చినంత వేగంగా - గూండాలు బయటికి పోయారు.

వర్ధనమ్మ ఎప్పటికో కళ్లు తెరిచింది. భర్తను చూసి భోరుమంటూ ఏడ్చింది. ముఖంపై నీళ్లు చల్లింది. గొంతులో నీళ్లు పోసింది. గాయాలకు రక్తం తుడిచి సపర్యలు చేసింది. మాస్టారికి స్పృహ వచ్చింది. ఒళ్లంతా ముద్దలా ఉంది. ఎక్కడ ఏ ఎముక విరిగిందో... ఏ కీలు తొలగిందో... బాధ... సలుపు... అంత బాధలోనూ, ఆయనకు అటకమీద జానకీ ఆమె పిల్లలూ మనసులో మెదిలారు.

"వాళ్లు వీళ్ల కంట పడలేదు! ఎంతలో ఎంత ప్రమాదం తప్పింది. అదే జరిగితే, ఆ పిల్లలూ తల్లీ శవాలుగానే మిగిలేవారు... తమ ప్రాణాలూ అనంతవాయువుల్లో కలిసిపోయుండేవి..." ఆయన గుండెల్లోంచి గాఢ నిట్టూర్పు వెలువడింది. హే భగవాన్! రక్షించు! నా దేశాన్ని...!"

సాయంత్రమయింది. చీకటి పడింది. చీకటి మరింత చిక్కపడింది. ఊరంతా గగ్గోలుగానే ఉంది. బయటకు వెళ్లడానికి లేదు. ఏడుపులు, పెడబొబ్బలు, రణగొణ ధ్వనులు, అన్నివైపుల నుంచి వినబడుతూనే ఉన్నాయి.

మాస్టారు మూలుగుతున్నారు. మనసు అగ్నిగోళంలా మండుతూనే ఉంది. హింస... పడగవిప్పిన పాశవిక చర్య... మనిషిలోని దానవత్వానికి పరాకాష్ఠ... బుసలు కొట్టే ద్వేషం... పగ... కసి... కార్పణ్యం... అహింసను అణువణువునా నింపుకున్న మహాత్ముడికి తప్పలేదు హింస... ప్రేమతో లోకాన్ని పునీతం చేసిన క్రీస్తుకు తప్పలేదు హింస...! హింసతో, చరిత్రలో కాలగర్భంలో కలిసిపోయిన కారుణ్యమూర్తులు ఎందరో... హింసతో అథః పాతాళానికి తొక్కబడిన అనాథలెందరో... అభాగ్యులు ఎందరో? నాడూ, నేడూ, ఒకనాడూ, హింసను పోషించింది నీతిలేని నాయకత్వమే.

మాస్టారి కంటిమీద కునుకు రావడం లేదు... వర్ధనమ్మ భర్తకు జావ కాచిపోసింది. అటక మీద ఉన్న జానకి పిల్లలకూ ఇంత అన్నం పెట్టింది.

ఏ క్షణంలో ఏం జరుగుతుందో... ఎవరు తలుపు తడతారో అన్న భయం... అందర్నీ వెంటాడుతూనే ఉంది.

అర్ధరాత్రి దాటింది! అదిగో అప్పుడు...

మాస్టారింటి తలుపు మీద మళ్లీ చప్పుడయింది. వర్ధనమ్మ భయంతో బిగుసుకుపోయింది. చప్పుడుతో పాటు, తమకు పరిచయమైన కంఠం, తలుపు తీయమని ప్రాధేయపడింది. వర్ధనమ్మ కిటికీ తెరచి, బయటకీ చూసి తలుపు తీసింది.

జానకి భర్త చిన్నారావు పిల్లిలా, అడుగులో అడుగు వేస్తూ మాస్టారింట్లోకి వచ్చాడు. వర్ధనమ్మను చూసి ఏడుపు ముఖం పెట్టాడు.

"అమ్మా! పొద్దుట్నించి కంపెనీలో ఉండిపోయాను. ఊళ్లో కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ ఉంది. ఎలాగో తప్పించుకుని వచ్చాను. మా ఇల్లంతా ధ్వంసం అయిపోయింది. మా కులం వాళ్లందరి ఇళ్ల మీద దాడి జరిగింది. జానకీ, పిల్లలూ ఏమయ్యారో, ఎక్కడికిపోయారో..."

చిన్నారావు సర్వం కోల్పోయినవాడిలా ఉన్నాడు. గొంతు జీరగా ఉంది. మాటలు తడబడుతున్నాయి. మాస్టారు కళ్లు తెరిచారు. చిన్నారావుని చూశారు. ఏదో చెప్పాలని ప్రయత్నించారు. చెప్పలేకపోయారు.

"నీ భార్యబిడ్డలు క్షేమంగా... మా ఇంట్లో అటకమీద ఉన్నారు. కానీ మాస్టారి పరిస్థితి

చూశావా? ఎంత దారుణంగా... ఎంత అన్యాయంగా" వర్ధనమ్మ దుఃఖం వెల్లువయింది. చిన్నారావు ఆమె దుఃఖాన్ని పట్టించుకోనట్లుగా ఆత్రంగా లోపలికి పరుగెత్తాడు. భార్యాబిడ్డల్ని అటకమీంచి దింపుకున్నాడు.

జానకి మాస్టారి మంచం వద్దకు వచ్చి... కన్నీళ్లతో ఆయన పాదాల్ని చుట్టేసింది. "బాబాయిగారూ! నన్ను నా పిల్లల్ని కాపాడారు. మీ ఋణం ఎలా తీర్చుకోను...? మావల్లే మీకీ పరిస్థితి వచ్చింది. మా ప్రాణాల్ని రక్షించి మీరు..." ఆమె దుఃఖోద్వేగంతో, ఆయన పాదాల్ని తడిపేసింది. మాస్టారు జానకికి ఏదో చెప్పాలని పెదాలు కదిలించారు. ఏమీ చెప్పలేకపోయారు.

"మాస్టారూ! వీధి చివర కంపెనీవాళ్ల కారుంది... వేరే దారి లేదు. ఈ ఊరొదిలి మేమంతా వెళ్లిపోవాలి... వస్తామండీ!" చిన్నారావు మాస్టారికీ, వర్ధనమ్మకూ రెండు చేతులూ జోడించి... తన భార్యా బిడ్డల్ని బలవంతంగా బయటకు లాక్కొని పోయాడు. కొన్ని నిముషాల వ్యవధిలోనే వీధి చివర కారు కదిలిన శబ్దం వినిపించింది.

మాస్టారి హృదయం నిండా మౌన ఘోష...

ఆయన మంచంలో మూలుగుతూనే ఉన్నారు. భర్త వెంట భయం భయంగా వెళ్లిన జానకి రూపం... ఆమె దుఃఖం ఆయన్ని కుదుపుతున్నాయి. ఏదో ప్రేమ, దయ, సానుభూతి ఆమెపై పొంగి పొరలుతున్నాయి. ఆమెతో చెప్పాలనుకున్న మాటలు - గొంతులోనే సుడులు తిరుగుతున్నాయి.

"నేను హింసని భరించి, నీకూ నీ పిల్లలకీ, తాత్కాలికంగానే రక్షణ కల్పించానమ్మా! శాశ్వతంగా మీకు, మీ జీవితాలకీ భద్రత ఉంటుందో లేదో...? ఎమ్మెల్యే వీరస్వామిని చంపిన, పదిమంది మనుషుల్లో నీ భర్త కూడా ఒకడు. హత్యచేసి పారిపోతూ జీపెక్కుతున్నప్పుడు... అతని ముఖం మీద ముసుగు తొలగి, స్వయంగా నాకంట పడ్డాడు... నీ భర్త హింసావాది... హింసా రాజకీయాల్ని పోషించే ఒక కంపెనీ యజమాని చేతిలో కీలుబొమ్మ...

హింసను నమ్ముకున్న ప్రతి వ్యక్తీ ప్రతిహింసకు బలవుతాడు తల్లీ... హింసధ్వని ఆ వ్యక్తినే కాక అతడ్ని నమ్ముకున్న వాళ్లనీ వెంటాడుతుంది. నిన్ను నీవే రక్షించుకోవాలి... నీ సహనం, ఆత్మస్థైర్యమే నీకు రక్ష కావాలి. నీ పిల్లలకూ శ్రీరామరక్ష కావాలి..."

మాస్టారు తనలో తాను సణుక్కున్నారు... గొణుక్కున్నారు...

ఆయన మస్తిష్కంలో 'హింసధ్వని' ప్రతిధ్వనిస్తూనే ఉంది..!

❀ ❀ ❀ ❀ ❀ ❀

("సహకార సమాచారమ్" మాసపత్రిక, ప్రథమ బహుమతి, నవంబరు-98)